క్లుప్తంగా

కొనసాగుతున్న తపాలా కార్మికుల సమ్మె



నూజివీడు: కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, తాత్కాలిక పోస్టల్ ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కారం కోరుతూ గ్రామీణ తపాల ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం నాటికి నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద ఆందోళన నిర్వహించారు. పోస్టల్ సిబ్బంది చేస్తున్న సమ్మెకు స్థానిక సర్పంచులు, ఇతరులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నూజివీడు డివిజన్ అధ్యక్షుడు అజరయ్య, సెక్రటరీ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు జగన్నాథం వాకిలయ్య, ఉపాధ్యక్షుడు మంగయ్య, బీపీఎంలు కరీముల్లా, ప్రకాష్, ఆముదాల ప్రకాష్, రవి పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ



రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్‌లో పాలు పోసి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ యూనియన్ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రెడ్డిగూడెం మండలం శ్రీరామపురం, ముచ్చినపల్లి సంఘం నందు యూనియన్ రెండోవిడత 2023–24 ఆర్థిక సంవత్సరానికి బోనస్‌ను పంపిణీ చేసినట్లు తెలిపారు. శ్రీరామపురం సంఘం నందు రూ.1,68,100, ముచ్చినపల్లి సంఘం నందు రూ. 1,17,960 యూనియన్ బోనస్ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరామపురం సంఘం అధ్యక్షుడు ఎస్. భాస్కరరావు, ముచ్చినపల్లి సంఘం అధ్యక్షుడు సాంబశివరావు, రూట్ సూపర్‌వైజర్ బి. శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



నూజివీడు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మర్రిబంధం, సీతారామపురంగ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, ఈఓఆర్డీ టీ సరస్వతి తదితరుల నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, పీఎం విశ్వకర్మ, పీఎం పోషణ్ అభియాన్, జలజీవన్ మిషన్, జన్‌ధన్ యోజన తదితర పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చాముండేశ్వరి, పంచాయతీరాజ్ ఏఈ సుభాకర్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వడ్డాది త్రినాథ్ రావు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల్లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రెవరెండ్ గద్దం సుధీర్, పాస్టర్ సత్యం క్రిస్మస్ సందేశం వినిపించారు. విద్యార్థులు క్రిస్మస్ గీతాలు ఆలపించారు. కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, ఏఓ కిషోర్‌బాబు కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఆగిరిపల్లి: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రుద్రరాజు పద్మరాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మెగా కంప్లెక్షన్ డ్రైవ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ లోగా నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్రావు, హౌసింగ్ ఏఈ అలిముల్లా, ఈఓపీఆర్డీ శేఖర్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

ఆగిరిపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం ఆత్మార్పణ చేసి, చరిత్రలో చిరస్మరణీయుడుగా నిలిచిపోయారని జెడ్పీటీసీ సభ్యుడు పిన్ని బోయిన వీరబాబు తెలిపారు. ఆగిరిపల్లి హోమియో వైద్యశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఎంపీడీఓ శంకర్రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హోమియో వైద్యురాలు రజిత, ఆగిరిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ సునీల్, యండూరి ప్రణీత్, విశ్రాంత ఉపాధ్యాయులు జూలూరు చంద్రమౌళి స్వరరావు పాల్గొన్నారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. కొండపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆయన వర్ధంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. వార్డు కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, అడపా వెంకయ్య నాయుడు, మొగిలి దయాసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు కుమ్మరి శ్రీనివాస్, మోటూరు సుధీర్, ఎంఎ బేగ్, బ్రహ్మాజీ, ఆనంద్, రాజేశ్వరరావు, యూకూబ్ పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు అని ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకుడు ప్రభాకరరావు తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మైలవరం నూజివీడు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంఘం నాయకులు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కాజా మహేష్, సూరిబాబు, వాసు, చలవాది మధు, దారా నాగరాజు పాల్గొన్నారు.



కొండపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గంపలగూడెంలో..

గంపలగూడెం: పొట్టి శ్రీరాములు వర్ధంతిని గంపలగూడెంలోని ఆర్యవైశ్య మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి మండలశాఖ అధ్యక్షుడు చిన్న సత్యంబాబు నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు నరసింహారావు, కాజా రవి, చారుగుండ్ల సుబ్బారావు, హనుమంతరావు, సుజాత పాల్గొన్నారు. పెనుగొలను గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వహణాధికారి శ్రీలత ఆధ్వర్యంలో శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు.



గంపలగూడెంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి



తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొట్టిశ్రీరాములు వర్ధంతి

తిరువూరులో..

తిరువూరు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆత్మత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముసునూరులో..

ముసునూరు: తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం ధైర్యంతో ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు, నిజాం సంస్థానాన్ని ఉక్కు సంకల్పంతో భారతావనిలో విలీనం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ధైర్య సాహసాలే మనకు ఆదర్శంగా నిలవాలని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు, భారత తొలి ఉప ప్రధాని పటేల్ వర్ధంతి సందర్భంగా లోపూడిలోని అశ్చర్య పాఠశాలలో శుక్రవారం వారి చిత్ర పటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తిరువూరు: ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ రూ పొందించిన పదో తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. దాతల సహకారంతో పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు హెచ్‌ఎం సత్యనారాయణరాజు తెలిపారు. యూటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

మూలపాడులో..

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 200మంది టెన్త్‌క్లాస్ విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ శుక్రవారం పంపిణీ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఎస్ఎస్ అప్పారావు ఆర్థిక సాయంతో వివిధ అంశాలతో రూపొందించిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రెడ్‌స్టార్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డేవిడ్‌రాక్ ఫెల్లర్, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.అమర్‌నాయక్, ఆర్మ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.



తిరువూరులో స్టడీ మెటీరియల్ పంపిణీ



మూలపాడు జెడ్పీ పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం

టి.గన్నవరం(మైలవరం): చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని నిరుద్యోగ యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు పేర్కొన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ పంచాయతీ శివారు టి.గన్నవరం గ్రామానికి చెందిన శీలం శిరీష, సాంబశివరావు దంపతులు వైఎస్సార్ క్రాంతి పథంలో మంజూరైన విస్తరాకుల తయారీ మిషన్ యూనిట్‌ను శుక్రవారం గంగాధరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిరీష దంపతులు విస్తరాకుల తయారీ యూనిట్ కొరకు దరఖాస్తు చేసుకోగా ప్రధాన మంత్రి ఎంప్లాయిస్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా వెల్వడం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ వారికి రూ.2.36 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆశీస్సులతో చిన్న పరిశ్రమలను స్థాపించేందుకు బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతకు ఆర్థిక సహకారం అందించే విధంగా 35 శాతం రాయితీ కల్పించి యువకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.



విస్తరాకుల తయారీ మెషీన్ ప్రారంభించిన గంగాధరరావు

రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ అసోసియేషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అసోసియేషన్ జాయింట్ జనరల్ సెక్రటరీ షేక్ చాంద్‌బాషా తెలిపారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో శుక్రవారం జరిగిన పెన్షనర్స్ అదాలత్‌లో ఆయన పాల్గొన్నారు. పర్సనల్ అధికారి, ఎకౌంట్స్, బ్యాంక్, ఆరోగ్య అధికారులపై పెన్షనర్స్ సమస్యలు ఆధారపడి ఉన్నాయన్నారు. వీరంతా పెన్షనర్లకు సహకరించడం అభినందనీయమన్నారు. పెన్షనర్లు ఉమిద్ కార్డుతో నేరుగా రిఫరల్ వైద్యశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకునే సదుపాయం ఉందన్నారు. 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎన్ సుభాష్, నాగరాజు పాల్గొన్నారు.



గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో పెన్షనర్స్ కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

ఇంధన పరిరక్షణ మనందరి బాధ్యత

ఇబ్రహీంపట్నం: ఇంధన పరిరక్షణ మనందరి బాధ్యత అని విద్యుత్ శాఖ విజయవాడ రూరల్ డివిజన్ డీఈ జీబి శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ కార్యాలయం నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని ఇంధనం, విద్యుత్ తదితర వనరుల సంరక్షణపై ఉద్యోగులు నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంట్లో విద్యుత్ పరికరాల వాడకంలో మెలకువలు పాటిస్తే విద్యుత్ పొదుపుతోపాటు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు.ఎలక్ట్రికల్ బైక్‌లవినియోగంతో ఇంధన పొదుపుపాటించాలని కోరారు. ఏడీఈ కొండలరావు, ఇన్‌చార్జ్ ఏఈ కృష్ణారావు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో..

ఇబ్రహీంపట్నం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమం ఎన్టీటీపీఎస్‌లో రెండోరోజు శుక్రవారం కొనసాగింది. స్థానిక సర్వీస్ భవనం వద్ద చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్ ఇంధన పొదుపుపై కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేడు విద్యుత్ నిత్యవసర వస్తువుగా మారిందన్నారు. విద్యుత్‌ను సరిపడేంత వాడి పొదుపు పాటించాలన్నారు.



ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డీఈ శ్రీనివాసరావు, ఈడీఈ కొండలరావు

జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలి

ఆగిరిపల్లి: సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు తెలిపారు. సింహాద్రి అప్పారావుపేట, పినామరెడ్డిపల్లిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సింహాద్రి అప్పారావుపేట, పిన్నామ రెడ్డిపల్లిలో రూ.23 కోట్లతో డీబీటీ, నాన్ డీబీటీలో ప్రజలకు లబ్ధి చేకూరిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, పిన్నమ రెడ్డిపల్లి సర్పంచ్, జోలా భూషణం, నాయకులు ఇసాక్, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మలకుమారి, నాయకులు సాగర్, రామకృష్ణ, ఈఓపీఆర్డి శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి

రాజవరం(గంపలగూడెం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి సాధించిందని ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అన్నారు. గంపలగూడెం మండలం పెనుగొలను సచివాలయం–2 పరిధిలోని రాజవరంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పల్లెకుపోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ చెన్నుపాటి నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు శేషగిరిరావు పాల్గొన్నారు.



అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మైలవరం: ఆధునిక ప్రపంచంలో ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో వివిధ టెక్నాలజీస్‌లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు విద్యార్థులకు సూచించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో రెడ్‌హాట్ లైనెక్స్‌పై మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు రెండు రోజులు పాటు నిర్వహించే వర్క్‌షాపును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు తమ కళాశాలలో అత్యుత్తమమైన శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీజెడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి, రిసోర్స్‌పర్సన్ బాలచందర్ కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో లైనక్స్ సర్వర్స్‌ను ఎలా తయారు చేయాలో నేర్చుకోవాలని తెలిపారు. బీ రాజేంద్రప్రసాద్, చిరంజీవి కో–ఆర్డినేటర్స్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్.జయప్రద పాల్గొన్నారు.



వర్క్‌షాపు ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థిని

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థి బొగిలి ప్రియాంక జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన 67వ రాష్ట్రస్థాయి అండర్ 19 అథ్లెటిక్స్ పోటీల్లో 3000 మీటర్స్ రైస్ వాకింగ్ విభాగంలో బొగిలి ప్రియాంక అత్యుత్తమ ప్రదర్శనతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనేందుకు ప్రియాంకను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రియాంకను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి పాఠశాల నగర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.



సోమేపల్లి మృతి సాహితీ రంగానికి తీరనిలోటు

విజయవాడ కల్చరల్: ఏపీ రచయితల సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మృతి సాహితీ రంగానికి తీరనిలోటని రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కవిగా సోమేపల్లి కవితా సంపుటులు ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఏపీ రచయితల సంఘం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సాహితీ సదస్సులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులను అలంకరించినట్లు పేర్కొన్నారు. నగరానికి చెందిన పలు సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణ రావు, బోడి ఆంజనేయరాజు, డాక్టర్ గుమ్మా సాంబ శివరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, ఏపీ రచయితల సంఘం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

సెమీ క్రిస్మస్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఈ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సెమీ క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన క్రైస్తవ మత పెద్దలు, చర్చి ఫాదర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. వేడుకల్లో 2,500 మంది చర్చి ఫాదర్లు, ఐదు వేల మందికి పైగా క్రైస్తవులు హాజరవుతారన్నారు. వాతావరణంలో మార్పులు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. క్యాండిల్ లైట్ నిర్వహణకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

దీక్ష విరమణల క్యూ లైన్ల పనులకు శ్రీకారం



భవానీపురం (విజయవాడ పశ్చిమ): భవానీ దీక్షల విరమణల నేపథ్యంలో వినాయకుడి గుడి వద్ద శుక్రవారం క్యూ లైన్ల పనులకు శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.ఎస్. రామారావు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు దీక్ష విరమణలు జరగనున్నాయి. తొలుత వినాయక దేవస్థానం వద్ద శ్రీకనకదుర్గమ్మ చిత్రపటం ఏర్పాటు చేసి ఆలయ వైదిక, అర్చక సిబ్బంది శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవి పాల్గొన్నారు.

వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రక్షణనిధి



విస్సన్నపేటలో ఆకృతి వస్త్రదుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: విస్సన్నపేటలో అంబేడ్కర్ సెంటర్ ఎ.కొండూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకృతి వస్త్ర దుకాణాన్ని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ అనుమోలు శివబాజీ, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి పాల్గొన్నారు.

నేడు పింఛన్‌దారుల దినోత్సవం

నూజివీడు: పట్టణంలోని సమతానగర్‌లోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ భవనంలో శనివారం 41వ అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూజివీడు ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, పాల్గొంటారని, పలువురు రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించనున్నట్లు తెలిపారు.

సీఎస్ఐ చర్చి వార్షికోత్సవం

తిరువూరు: స్థానిక రాజుపేట సీఎస్ఐ చర్చి వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. తిరువూరు డీనరీ చైర్మన్ దైవ కృపావరం, నియోజకవర్గ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా జయంత్‌బాబు చర్చిలో జరిగే కార్యక్రమాలను వివరించారు. సంఘస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అయోధ్య రామమందిరం అక్షింతల ఊరేగింపు

విస్సన్నపేట: అయోధ్య రామమందిరం ప్రారంభం సందర్భంగా శ్రీరామస్పర్శ అక్షింతలు శుక్రవారం విస్సన్నపేట చేరుకున్నాయి. ఈ మేరకు అక్షింతలను నాలుగు రోడ్ల సెంటర్‌లో ఉన్న రామాలయం నుంచి బస్టాండ్ సెంటర్‌వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. వారం రోజులు పాటు అక్షింతలు ఆలయంలో ఉంచి నామ సంకీర్తన, భజనలు నిర్వహించి ప్రతి ఇంటికీ అక్షింతలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు సుందరకాండ ప్రవచనం

మైలవరం: మైలవరంలోని ఆంజనేయస్వామి ఆలయంలో 32వ హనుమద్దీక్షలు సందర్భంగా శనివారం ప్రముఖ హిందూధర్మం చానల్ గురుతత్వ ప్రచారకులు సాయిశ్రీనివాస్‌చే సుందరకాండ ప్రవచనం జరుగుతుందని దేవస్థానముల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్వీ నివృత్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలపారు. ఈ నెల 22న హరేరామనామ సంకీర్తన, 23న శనివారం హనుమాన్ చాలీసా పారాయణం, 24న హనుమత్ వ్రతాలు అనంతరం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి నెల రోజులు ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నెల 23న ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది. సీఐ రామారావు తెలిపిన కథనం మేరకు పోరంకి శ్రీనివాసానగర్‌కు చెందిన వి.వరాలమ్మ (65) ఈ నెల 2వ తేదీన కృష్ణవేణి పాఠశాల వద్ద రోడ్డు దాటుతుండగా ఆమెను కంకిపాడు వైపు నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. కాగా ఆమె ఆస్పత్రి నుంచి 9వ తేదీన ఇంటికి తీసుకొచ్చి చికిత్స చేయిస్తున్నారు. అయితే ఆమె పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు వి.సన్నీబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.